## 'తెలుగు భాష భలే తేలిక'

ఇలా ఆస్టిన్ టెక్సస్ ఆస్టిన్ టెక్సస్ వర్సిటీలో ఉన్న ఇరవై మంది తెలుగు నేర్చుకుంటున్న విద్యార్థులు ఇరవై తెలుగు కథలు చెప్పగలరు. వీరిలో కొంతమంది తెల్లవాళ్ళు. కొందరు ఉత్తరాది వారు. ఎక్కువ మంది మన రెండో తరం తెలుగువాళ్ళు. టెక్సస్ వర్సిటీ సంవత్సరం క్రితం తొలిసారిగా తెలుగు కోర్సు ప్రారంభించినప్పుడు వీరంతా కొంత ఉత్సాహం, కొంత బెరుకుగా కోర్సులో చేరారు. తెలుగు చాలా కష్టమైన భాష అని, ఏ కొంచెం తేడా వచ్చినా గ్రేడ్ పడిపోతుందనే భయం వారిలో ఉండేది. కాని, తెలుగు కోర్స్‌లో చేరిన తరువాత వారిలో ఆ భయం పూర్తిగా పోయింది. తెలుగు నేర్చుకోవడం ఇంత సరదాగా ఉంటుందని, ఇంత త్వరగా రాయడం నేర్చుకోగలమనీ తాను అనుకోలేదని దీపిక అనే విద్యార్థిని పేర్కొంది. 'ఇక్కడ మేం భాష మాత్రమే కాదు, మా పూర్వీకుల గురించి, మా చరిత్ర గురించి, మా సాహిత్యం గురించి చాలా నేర్చుకుంటున్నాం' అంటోంది అనుపమ అనే విద్యార్థిని.

'మా ప్రొఫెసర్ అఫ్సర్ ఒకసారి క్లాస్‌లో ఓల్గా రాసిన కథ 'సమాగమం' గురించి చెప్పారు. అది ఇప్పుడు నా డాక్టరేట్ పరిశోధనకు అంశంగా పనికొస్తోంది' అన్నది డాక్టరల్ విద్యార్థిని విభా సెటియా. గత సంవత్సరం తానా చొరవతో టెక్సస్ వర్సిటీ తెలుగు కోర్సు ప్రారంభించాక, ఈ క్యాంపస్‌లో దక్షిణ భారతం వైపు ముఖ్యంగా తెలుగు వైపు అందరి దృష్టి మళ్ళింది.

ఇటీవల తానా, టెక్సస్ వర్సిటీల సంయుక్త నిర్వహణలో తెలుగు భాషా దినోత్సవం వైభవంగా జరిగింది. తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర ఈ సభకు అధ్యక్షత వహించారు. పెద్ద సంఖ్యలో తెలుగు భాషాభిమానులు ఈ సభకు తరలివచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షోపన్యాసం చేసిన ప్రసాద్ తెలుగు భాష అభివృద్ధికి తానా పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. అమెరికాలోని రెండో తరం తెలుగు విద్యార్థులకు ఆస్టిన్ వర్సిటీ తెలుగు కోర్స్ స్ఫూర్తినిస్తోందన్నారు.

సభకు దక్షిణాసియా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఇట్టి అబ్రహాం స్వాగతం పలికారు. అతి కొద్ది కాలంలోనే ఆస్టిన్ తెలుగు కోర్స్‌కు మంచి పేరు వచ్చిందని, మరింత ముందుకు కొనసాగించాలని విద్యార్థుల నుంచి వత్తిడి వస్తోందని ఆయన పేర్కొన్నారు. తెలుగు కోర్స్‌ను మరింత విస్తృత పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలుగు కోర్స్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఆస్టిన్ తెలుగు విద్యార్థులు ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఒక భాషగా మాత్రమే కాకుండా విస్తారమైన సంస్కృతిగా తెలుగు కోర్స్ అందరినీ ఆకట్టుకుంటున్నదని, తెలుగు చరిత్ర, సాహిత్యాల మీద తమకు రోజు రోజుకూ ఆసక్తి పెరుగుతోందని విద్యార్థులు వివరించారు.